## క్లుప్తంగా

### వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కానిస్టేబుల్ రమణ

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయానికి భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. రూ.5 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మునగపాకకు చెందిన కానిస్టేబుల్ కాకి రమణ, దివ్య దంపతులు గురువారం రూ.10,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పెంటకోట ఉమేష్, వెలగా శ్రీనివాసరావు, వెలగా సురేష్‌కుమార్, ఆడారి కాశీబాబు, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి రమణబాబు, బొడ్డేడ రాము నాయుడు, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### పరిహారంగా నగదు ఇవ్వాలని వినతి



నిర్వాసితుల సమస్యలపై అచ్యుతాపురం డీటీ శ్యామ్‌తో చర్చిస్తున్న నాయకులు

అచ్యుతాపురం రూరల్: రోడ్డు విస్తరణ బాధితులకు టీడీఆర్ బాండ్లకు బదులు పరిహారంగా నగదు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌ను కలిశారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వరకూ రోడ్డు విస్తరణలో కోల్పోతున్న స్థలాలు, ఇంటి నిర్మాణాల యజమానులకు నగదు రూపంలో పరిహారం ఇవ్వాలన్నారు. నిర్వాసితులు టీడీఆర్ బాండ్లు తీసుకోవడానికి సిద్ధంగా లేరన్నారు. నగదు రూపంలో పరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

### కొడవటిపూడి పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్



కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్

కోటవురట్ల: కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కావడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవో నంబరు 117 ప్రకారం ఉమ్మడి విశాఖ జిల్లాలో 33 హైస్కూళ్లు మంజూరు కాగా, వాటిలో కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్‌కు స్థానం దక్కింది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల సాకారం కావడంతో గ్రామస్తులతోపాటు శివారు గ్రామాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచడంలో ఉపాధ్యాయులు సఫలీకృతులు కావడంతో హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ సాధ్యమైంది. ఈ మేరకు సర్పంచ్ కోసూరు అప్పారావు, ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్, స్కూల్ కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీనివాసరావు, హెచ్‌ఎం కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు ప్రతాప్‌కుమార్, పావని సునాధ, కృపామణి, లోవరాజు, నాగూర్‌బాషా, శంకరరావు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఈవోలు రామారావు, శ్రీజోష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

### సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాఫిక్ పర్యవేక్షణ



ట్రాఫిక్ సీఐకి సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్: ట్రాఫిక్ పర్యవేక్షణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నిరంతరం ప్రజలకు కనిపించేలా విజిబుల్‌గా ఉండాలని ఆయన ఆదేశించారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడంలో భాగంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం, వెలుతురు లేని ప్రాంతాలలో సరైన లైంటింగ్ ఏర్పాటు చేయడం, ప్రధాన జంక్షన్ల వద్ద మైక్‌ల ద్వారా హెచ్చరికల పంపిణీ చేయడం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని సూచించారు. రద్దీ నివారణకు అవసరమైన పార్కింగ్ స్థలాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ, ఎస్‌బి సిఐ బాల సూర్యారావు, ఎస్ఐ శేఖర్‌లు పాల్గొన్నారు.

# కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?



మునగపాకలో సాగునీటి కాలువ దుస్థితి

పూడికతీతకు నోచుకోని వైనం

అధ్వానంగా దర్శనం

పట్టించుకోని అధికారులు

సీజన్‌కు ముందే చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు

మునగపాక: కూటమి పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఖరీఫ్‌కు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇంతవరకు సాగునీటి కాలువలను అభివృద్ధి చేసిన పాపాన పోలేదు. ఎక్కడ చూసినా ఆధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దాంతో ఖరీఫ్ సాగుపై రైతులకు బెంగ పట్టుకుంది. సీజన్‌కు ముందు కాలువలు, చెరువులను ఎప్పటికపుడు మెరుగుపరచాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**స్వరూపాలు కోల్పోతున్న సాగునీటి కాలువలు...**

మండలంలో మెజార్టీ సాగునీటి కాలువలు స్వరూపాలు కోల్పోతున్నాయి. సాగునీటి కాలువల్లో తూటికాడ పెరిగిపోవడం, కొన్ని చోట్ల మురుగు ప్రవహించడం వంటి పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. దీంతో ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం లేదు. కాలువలను అభివృద్ధి చేయాల్సిన అధికారులు స్పందించడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు.

**సాగునీటి కాలువల ఆధారంగా సాగు...**

మండలంలో మెజార్టీ రైతులు సాగునీటి కాలువల ఆధారంగా సాగు చేపడుతున్నారు. మునగపాక, తోటాడ, గవర్ల అనకాపల్లి, మూలపేట, అరబుపాలెం, ఒంపోలు, నాగులాపల్లి, ఉమ్మలాడ, గణపర్తి, చూచుకొండ తదితర ప్రాంతాల్లో రైతులు వరి, చెరకుతో పాటు ఇతర పంటల పండిస్తుంటారు. వారంతా సాగునీటి కాలువలపై ఆధారపడుతుంటారు. అయితే ఆయా ప్రాంతాల్లోని కాలువలు అధ్వానంగా ఉండడంతో సాగునీరు ఎలా ప్రవహిస్తుందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కాలువలపై అభివృద్ధిపై దృష్టి సారించరూ...?**

సాగునీటి కాలువల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించడం లేదు. వర్షాకాలం రాక ముందే సంబంధిత కాలువలను అభివృద్ధి చేయాల్సిన అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. రబీతోపాటు ఖరీఫ్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు కాలువల నిర్వహణ చేయాల్సి ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. మునగపాక బీసీ కాలనీకి ఎదురుగా కాలువలో సిల్టు పేరుకుపోయింది. సిల్టు తొలగించకపోవడంతో సాగునీరు ప్రవహించే పరిస్థితులు ఉండవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి వనరులను సకాలంలో అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



నాగులాపల్లిలో సాగునీటి కాలువలో మురుగునీరు

### కాలువల్లో పేరుకుపోయిన తూటికాడ



నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాగునీటి కాలువలను సీజన్‌కు ముందు అభివృద్ధి చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఎక్కడ చూసిన తూటికాడ, మురుగు ప్రవాహం కనిపిస్తోంది. ఇలా అయితే పంటల సాగు ఎలా సాధ్యమవుతుంది. అధికారులు స్పందించి రైతులకు మేలు జరిగేలా చూడాలి.

– టెక్కలి జగ్గారావు, రైతు, మునగపాక

### కాలువల అభివృద్ధి చేయాలి



సాగునీటి కాలువల అభివృద్ధిపై అధికారులు బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారు. కేవలం సాగునీటి కాలువలపై ఆధారపడి సాగు చేసే రైతులు అవస్థలు పడుతున్నారు. కాలువల్లో సిల్టు పేరుకుపోతుంది. పలు చోట్ల సాగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. వీటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– ఆడారి అచ్చియ్యనాయుడు,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

### ఇబ్బందులు రాకుండా చర్యలు

సాగునీటి కాలువల అభివృద్ధికి అవసరమయ్యే చర్యల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. కొన్ని చోట్ల మరమ్మతులకు గురైన రెగ్యులేటర్లను అందుబాటులోకి తీసుకువచ్చాం. సాగునీటి కాలువల ద్వారా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటాం. రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తాం.

– సుప్రియ, నీటిపారుదల శాఖ ఏఈ

### ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

కోటవురట్ల: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పాయకరావుపేట డివిజన్ వ్యవసాయ శాఖ సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, కౌలు కార్డులు, మట్టి నమూనా సేకరణపై సిబ్బందితో సమీక్ష చేశారు. అనంతరం రైతులతో సమావేశమై ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూమిని సంరక్షించడమే కాకుండా పర్యావరణానికి హాని కలగకుండా కాపాడవచ్చన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, ఇతర హానికర రసాయనాలు ఉపయోగించకుండా సహజ పద్ధతుల్లో సేద్యం చేయాయలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతం కావడమే కాకుండా నీటిని ఆదా చేయవచ్చన్నారు. దీని ద్వారా పంటల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.ఉమా ప్రసాద్, మండల వ్యవసాయాధికారులు బి.సరోజిని, సి.హెచ్.చిరంజీవి పాల్గొన్నారు.

## ఘనంగా వాడనర్సాపురం దుర్గాలమ్మ పండగ



వాడనర్సాపురం దుర్గాలమ్మ వారు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం వాడనర్సాపురంలో దుర్గాలమ్మ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామ వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన బంధువులు రావడంతో గ్రామంలో సందడి వాతావరణం ఏర్పడింది.



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

**ఘనంగా పైడితల్లమ్మ పండగ**

ఎస్.రాయవరం: ఉప్పరాపల్లిలో పైడితల్లి అమ్మవారు జాతర గరువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ఇలవేల్పుగా కొలిచే ఈఅమ్మవారికి వేకువజాము నుంచి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి భారీ మందుగుండు సామగ్రి వెలిగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



జాతర పూజలందుకున్న పైడితల్లమ్మ

### వైభవంగా మరిడిమాంబ పండగ

అమ్మవారిని దర్శించుకున్న పార్టీ నేతలు ధర్మశ్రీ, ప్రసాద్



మరిడిమాంబను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు ధర్మశ్రీ, ప్రసాద్ తదితరులు

మునగపాక: మండలంలోని రామారాయుడుపేటలో మరిడిమాంబ పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నేతలు పాలమరశెట్టి నాయుడు అప్పలనాయుడు, బొడ్డేడ జగ్గప్పారావు, కుందిరి శ్రీను, శివనాయుడు, గురుమూర్తి, లక్ష్మణరావు, మాణిక్యాలరావు, నరేష్, రత్నాకర్ పాల్గొన్నారు.

### గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధిలో నూతనంగా ఆధునికీకరించిన గౌరీపరమేశ్వరుల ఆలయం తృతీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయత్రం ఆలయ ప్రాంగణంలో గౌరీ పరమేశ్వరుల కళ్యాణం రేజేటి గోప అప్పలచార్యులు పర్యవేక్షణలో ఘనంగా జరిగింది.

## సేవా గుణం అలవాటు చేసుకోవాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవాటు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. హైదరాబాద్‌లో స్థిరపడిన మునగపాకకు చెందిన వ్యాపారి ఆడారి ధానకర్ణ జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ దానకర్ణ మొదటి నుంచి గ్రామంలో అభివృద్ధికి తనవంతు సాయం అందజేస్తున్నారన్నారు. కోవిడ్‌లో ప్రతీ కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారన్నారు. దానకర్ణ లాంటి వారు ముందుకొచ్చి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మళ్ల సురేంద్ర, పెద్దలు టెక్కలి పరశురామ్, ఆడారి అచ్చియ్యనాయుడు, మళ్ల సంజీవరావు, పెంటకోట ఆదినారాయణ, ఆడారి కాశీబాబు, పెంటకోట వెంకట్, కాండ్రేగుల జగ్గారావు పాల్గొన్నారు.



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

## దంచికొట్టిన వాన..



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షం నీరు



కొరుప్రోలు వైఎస్సార్ కాలనీకి వెళ్లే రోడ్డుపై చేరిన వర్షపు నీరు

కోటవురట్ల: భగభగ మండిపోతున్న ఉష్ణతాపం నుంచి వరుణుడు ఉపశమనం కలిగించాడు. పది రోజులుగా ఉష్ణోగ్రతల్లో మార్పు చోటుచేసుకుని ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత పెరిగి వడగాలులు వీస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో గురువారం వరుణుడు పలకరించాడు. సుమారు గంట పాటు వాన దంచికొట్టింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో జనాలు సేద తీరారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులకు మాత్రం ఇక్కట్లు తప్పలేదు. భారీగా కురిసిన వర్షానికి ఎంపీడీవో కార్యాలయం ముందున్న మెయిన్ రోడ్డులో మోకాలు లోతున నీరు నిలిచిపోయింది. దాంతో అటూ ఇటూ వెళ్లేవారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పాదచారులు వెళ్లే దారిలేక బురదనీటిలోనే అవస్థలు పడుతూ వెళ్లాల్సి వచ్చింది. అధికారులు స్పందించి చాలా కాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఎస్.రాయవరం: మండలంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వేసవి ఎండలతో విలవిలలాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉదయం నుంచి ఎండ కాయగా, సాయంత్రం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని చల్లని వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి మండల వాసులు సేద తీరారు.

## తెలుగు భాష ఎంతో విశిష్టమైనది



తెలుగు భాష గురించి వివరిస్తున్న రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ



గ్రంథాలయంలో సమ్మర్ క్లాస్

అచ్యుతాపురం: తెలుగు అక్షరాల్లో మంచి గమ్మత్తు ఉంటుందని, తెలుగు వ్యాకరణంలో ఎన్నో విశిష్టతలు ఉంటాయని అచ్యుతా ఇంగ్లిషు మీడియం స్కూల్ తెలుగు టీచర్ ఆర్. సత్యనారాయణ తెలిపారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. పొట్టి, పొడుగు తెలుగు అక్షరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలుగు భాష ఎంతో అరుదైనదని, ఎంతో కష్టమైనదని తెలిపారు. పదాల ఉచ్చారణలో దీర్ఘాలు, ఒత్తులు సరిగ్గా పలకగలగాలని తెలిపారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నక్కపల్లి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. నీతికథల పోటీలు నిర్వహించారు. రెండురోజుల పాటు నైతిక విలువలను పెంపొందించే కథల పోటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు లైబ్రేరియన్ కే జనార్దన్ తెలిపారు. కథలను రాయడం, చదవడం, వినిపించడం వాటి గురించి విశ్లేషించడం వంటివి నేర్పించడం జరుగుతోందన్నారు. పలువురు విద్యార్థులు నీతికథలు, పంచతంత్ర కథలు రాయడం విశేషమన్నారు. పగటి కలలు పనికి చేటు తాతయ్య చెప్పిన నీతికథలు, వంటివి విద్యార్థులతో చెప్పించారు. వేసవి శిబిరాల్లో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు జూన్ 6న బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు చెప్పుట, రాయించుట, తెలుగు వ్యాకరణం చెప్పారు. అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం సందర్భంగా కుటుంబం గురించి, వాటి విలువల గురించి వివరించారు. ఉమ్మడి కుటుంబం ఒక వైభవం అని తెలిపారు. ప్రతి ఒక్కరూ కుటుంబం విలువ తెలసుకోవాలన్నారు. 20 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణ్‌రావు తెలిపారు.

## ఈదురు గాలుల బీభత్సం

- సత్యవరం గ్రామం అతలాకుతలం
- నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు
- నివాస స్థలాల పైకప్పు రేకులు ఎగిరిపోయిన వైనం
- ఇళ్లలో తడిసిపోయిన ధాన్యం
- సత్యవరంలో నేలకొరిగిన చెట్లు
- స్తంభించిన జనజీవనం




సత్యవరంలో నేల కొరిగిన విద్యుత్ స్తంభం



చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో అతలాకుతలమైన సత్యవరం గ్రామం

మాడుగుల : మండలంలో గురువారం సాయంకాలం ఈదురుగాలులుతో కూడిన వర్షం బీభత్సం జరిగింది. మండలంలో సత్యవరం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లతో కూడిన విద్యుత్ స్తంభాలు 8 వరకు నేల కొరిగాయి. వొమ్మలి, జంపెన, రహదారుల్లో పలు చోట్ల చెట్లు విరిగిపోవడంతో సత్యవరం గ్రామం నుంచి ప్రజలకు ఎటూ వెళ్లలేని పరిస్థితి దాపురించింది. గ్రామంలో విద్యుత్ సదుపాయంలేక, రహదారులు చెట్లు కొమ్మలతో నిండిపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. గ్రామంలో ఉన్న చెట్లు మొత్తం నేల కొరగడంతో గ్రామంలో కూడా జనం తిరగలేక విద్యుత్ లేక అంధకారంలో ఉండిపోయారు. గురువారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ లేకపోవడంతో తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సత్యవరం గ్రామానికి చెందిన రైతు యాలం రామునాయుడుకు చెందిన రేకుల ఇంటిపై చెట్లు ఒరిగిపోవడంతో పై కప్పు రేకులు విరిగిపోయి ఇంటిలో ఉన్న సుమారు 30 బస్తాల ధాన్యం, ఇతర వస్తువులు తడిసి ముద్దయ్యాయి. రూ. 2 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన జాజిబొగ్గల రమణమ్మ రేకుల ఇంటిపై రేకులు గాలికి ఎగిరిపోవడంతో రూ.లక్ష ఆస్తి నష్టం జరిగింది. సత్యవరం ప్రధాన రహదారిపై మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

## జనాభా ప్రకారం నిధులు కేటాయించాలి





16వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి : గ్రామాల అభివృద్ధికి 15వ ఫైనాన్స్ నిధులు 2011 జనాభా లెక్కలు ప్రకారం ఒక్కో మనిషికి రూ.117 ఇస్తున్నారని, అనకాపల్లి మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 84 వేల మంది నివసిస్తే, 2025 జనాభా లెక్కల ప్రకారం గ్రామాల్లో లక్ష 24 మంది నివసిస్తున్నారని, 16వ ఫైనాన్స్ కమిషన్‌లో గ్రామాల్లో ఒక్కో మనిషికి రూ.900 కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. తిరుపతిలో 16వ ఆర్థిక కమిషన్ సమావేశంలో కమిషన్ సభ్యుడు డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్‌కు గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో జనాభాకు నిధులు కేటాయించాలని, గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం కమిషన్ నిధులతో పనులు జరుగుతున్నాయని, పనులు జరిగే సమయంలో రూ.లక్ష నిధులతో అభివృద్ధి చేసే సమయంలో రూ.లక్షలో జీఎస్టీగా 18 శాతం ఇవ్వడం జరుగుతుందని, మండల పరిషత్ నిధులు గ్రామాల్లో ఖర్చు చేసే సమయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో జీఎస్టీ తొలగించాలని కోరారు. 15వ ఫైనాన్స్ నిధులు టైడ్, అన్‌టైడ్ రెండు విభాగాలు ఇస్తుందని, టైడ్‌లో 40 శాతం నిధులు తాగునీరు, పరిశుభ్రతకు కేటాయిస్తున్నారని, అన్‌టైడ్ గ్రాంట్ నిధులు గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రుల అభివృద్ధి ఇతర వినియోగాలకు ఖర్చు చేస్తున్నారని, 15 ఫైనాన్స్ నిధులు టైడ్, అన్‌టైడ్‌గా కాకుండా ఒకే విధంగా నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## విద్యాశాఖ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మాకవరపాలెం: విద్యార్థుల హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గౌతమి లలిత కళాశిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ ప్రారంభించారు. దీనిపై ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో మండల విద్యాశాఖ అధికారులు వేసవి శిక్షణను పాఠశాలలో జరగకుండా నిలిపివేశారు. దీంతో నిర్వాహకులు తమ దృష్టికి తీసుకువచ్చారని సంపత్‌కుమార్ తెలిపారు. రాజకీయ, మతపరమైన , ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు పాఠశాలల ఆవరణలో నిర్వహించరాదని ఆదేశాలున్నాయే తప్ప, విద్యార్థులకు యోగా, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగం వంటి వాటిలో శిక్షణ నిర్వహించ వద్దని ఆదేశాలు లేవన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 కిపైగా ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణలు జరుగుతున్నాయని స్వయంగా జేసీ జాహ్నవి ప్రకటించారన్నారు. సోమవారంలోగా పాఠశాలలో యథావిధిగా వేసవి శిక్షణ జరిగేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే విద్యాశాఖ అధికారులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.